క్లుప్తంగా

క్షీరాభిషేకం



నర్సంపేట : నర్సంపేటలో బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పట్టణంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌సింగ్, ఆంగోత్ భద్రయ్య, ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ పత్తినాయక్, సరోజన, హరికిషన్, జేతురాం నాయక్, జగన్ నాయక్, బోడ భద్దు నాయక్, బోడ మురళి, యాకస్వామి, భద్రు నాయక్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కాట్ల కోమల మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందశాతం సీసీ రోడ్లు గల గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారన్నారు. మరో మూడు నెలలలో దుగ్గొండి మండలం రూపురేఖలు మారనున్నాయన్నారు. ఇప్పటికే అంతర్గత, లింక్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని ఆమె తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, సర్పంచ్ పాశం పోశాలు, ఎంపీటీసీ మోర్తాల రాజు, ఉప సర్పంచ్ భట్టు పైడి, చల్ల కిషన్, నల్లబెల్లి శోభన్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

వరంగల్ (పర్వతగిరి) : గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని వడ్లకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పనులు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అత్తి రేవతికుమార్, ఉపసర్పంచ్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై ఫిర్యాదు



గీసుకొండ : మండలంలోని కోటగండి నుంచి కొమ్మాల వరకు ఎటువంటి ప్రభుత్వ, 'కుడా'అనుమతి లేకుండా అక్రమంగా వెంచర్లు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బీమగాని సౌజన్య డీపీఓ కల్పనతో పాటు కుడా వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం వారిని కలిసి అక్రమ వెంచర్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, కొనుగోలు చేసిన వారు మోసపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బియ్యం అందజేత



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 1వ వార్డుకు చెందిన అజ్మీరా వీరన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్కార్సు రమేష్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు.కార్యక్రమంలో శ్రీరామోజు మురళి, కొలిపాక మోహన్, ఎరుకల రమేష్, మెరుగు పైడి, కుసుంబ నిరంజన్, వెంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

10న మండల సమావేశం

వర్ధన్నపేట : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10న(సోమవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని కోరారు.

'బలగం' సినిమా ప్రదర్శన

చెన్నారావుపేట /సంగెం: బంధుత్వాలు కలిసిపోయే విధంగా నిర్మించిన సినిమాతో తమ గ్రామంలోని ప్రజలు మంచి బలగంగా ఉండాలనే ఆలోచనతో సినిమా చూపించడం జరుగుతుందని ప్రజా ప్రతినిధులు తెలిపారు. సంగెం మండలంలోని రామచంద్రాపురం, చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామంలో సోమవారం రాత్రి 'బలగం' సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంపల్లి జయశ్రీ, ఎంపీటీసీ చిదురాల రజిత, లింగాపురం సర్పంచ్ తప్పెట రమేష్ మాట్లాడారు.

పొలాలు ఎండుతున్నాయి

- తుంగబంధం కాల్వకు అందని సాగునీరు
- రాత్రి వేళల్లో పడిగాపులు కాస్తున్న రైతులు
- పాకాల వాగులోకి వృథాగా నీరు



ఎండిపోతున్న వరి పంటను చూపుతున్న రైతులు

చెన్నారావుపేట : దేశానికి వెన్నుముక అన్నదాత.. ఆరుగాలం రాత్రనక, పగలనక చెమటోడ్చి, కష్టపడి పంటలను పండిస్తుంటారు. కానీ పాకాల చెరువు ఆయకట్టు కింద ఉన్న తుంగబంధం కాల్వ చివరి ఆయకట్టు సాగుకు చుక్కనీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి.. తలాపునే నిండుకుండాల పాకాల సరస్సు ఉన్న సాగుకు నీరు అందడం లేదు. దీంతో యాసంగిలో సాగుచేసిన వరి పంట పొట్టదశలో ఉండడంతో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఇదే విషయం తెలిపిన పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆరోపించారు. రంగాపురం గ్రామ శివారులో చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల రైతులకు వందల ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయి. వారు యాసంగి పంట సాగు చేస్తున్నారు. 20 రోజుల క్రితం వడగళ్ల వానతో వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉన్న పంటను నీరు పెట్టి కాపాడుకుందామని రైతులు ఆశ పడితే సాగు నీరు రావడం లేదు. దీంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. రాత్రి సమయంలో సాగు నీరు కోసం తుంగబంధం కాల్వ వద్ద పడిగాపులు కాస్తున్నారు. అవసరం లేకున్నా మున్నేరు(పాకాల వాగు)నుంచి సాగు నీరు వృథాగా పోతుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తుంగబంధం కాల్వకు సాగు నీటి విడుదల చేయాలని రైతులు కోరారు.

పొట్టదశలో పంటలు



తుంగబంధం కాల్వ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. సాగునీటి కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాస్తున్నాం. వరి పొట్టదశలో ఉంది. ఇప్పుడు నీరు అవసరం ఎక్కువగా ఉంటుంది. రాళ్లవానతో నష్టం వాటిల్లింది. ఉన్న పొలాన్ని కాపాడుకుందామంటే నీరు రావడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి సాగు నీటిని విడుదల చేసి ఆదుకోవాలి.

– ఎగ్గడి చేరాలు, రైతు

పల్లె పల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : నర్సంపేటలో ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నర్సంపేట డివిజన్ ఓబీసీ మోర్చా కో ఆర్డినేటర్ మండ కార్తీక్ ఆధ్వర్యంలో ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్‌లు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న ఓబీసీ పథకాల గురించి పల్లె పల్లెకు తెలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. రేసు శ్రీనివాస్, నర్సింహ రాములు, పంజాల రాము, గటిక అజయ్, వెల్దండి మార్కండేయ, బ్రహ్మచారి, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నిక



సిద్దన రమేష్



తప్పెట రమేష్

చెన్నారావుపేట : చెన్నారావుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా అమీనాబాద్ గ్రామానికి చెందిన సిద్దన రమేష్, లింగాపురం గ్రామానికి చెందిన తప్పెట రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారికి నియామక పత్రాలు అందించారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గీతకార్మికుడిని ఆదుకోవాలి

చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి పడిన గీతకార్మికుడు ఈరసరపు ఐలయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ మండల అధ్యక్షుడు వడ్లకొండ రాజుకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని లింగగిరి గ్రామంలో మంగళవారం గాయపడిన గీతకార్మికుడిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాయపడిని ఐలయ్యకు ప్రభుత్వం ఆస్పత్రి ఖర్చుల కోసం ఎక్స్‌గ్రేషియాను అందించాలన్నారు. పులి చిన్న రమేష్‌గౌడ్, పులి పెద్ద రమేష్‌గౌడ్, చీకటి పెద్ద రాజుగౌడ్, సాగర్‌గౌడ్, అంబాల శ్రీనుగౌడ్, గంగాపురవు వెంకటనర్సుగౌడ్ ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఖానాపురం : మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన ఊడుగుల కాశీనాథం మంగళవారం ఐనపల్లి శివారులో తాటిచెట్టు ఎక్కడానికి వనానికి వెళ్లాడు. చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారీ కింద పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా కాశీనాథాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వేజెళ్ల కిషన్‌రావు, సర్పంచ్ బాషబోయిన ఐలయ్యలు పరామర్శించారు.

వీఆర్‌ఏకు గాయాలు

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ రవికుమార్ మంగళవారం రామాలయం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గూడూరు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ప్రమాదంలో రవికుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఖానాపురం : విప్లవ ఉద్యమాన్ని నిర్మించడానికి తన శాయశక్తుల కృషి చేసిన నిమ్మగడ్డ సరోజన అలియాస్ బేబక్క సంతాప సభను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈనెల 10న నిర్వహించనున్న సంతాప సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను, దోపిడీ హింసను ఎదురించి మహిళలను సమీకరించి ఎన్నో పోరాటాలు చేసిందన్నారు.కార్యక్రమంలో శంకర్, రమేష్, బానోత్ విజయ, సరస్వతి, వీరలక్ష్మి, సుధాకర్, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన

వరంగల్ (పర్వతగిరి) : బైండోవర్ ఉల్లంఘనలో నలుగురికి జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. మండలానికి చెందిన దొనికెన కృష్ణమ్మ, నిమ్మ అనసూయ, చీనూరి రజిత, ముంజల పద్మ గతంలో గుడుంబా తయారీకి పాల్పడుతూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దీంతో ప్రవర్తన మార్చుకోకుండా మరోసారి గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతూ పట్టుబడడంతో మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. గతంలో బైండోవర్ నియమాలను ఉల్లంఘించడంతో తహసీల్దార్ కోమి నలుగురికి జైలు శిక్ష విధించారు. దీంతో వారిని ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించారు. బైండోవర్ నియమాలను ఉల్లంఘిస్తే రూ.2లక్షల జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

బ్రిడ్జి నిర్మాణం పనులు షురూ..



పాత కల్వర్టును తొలగిస్తున్న పొక్లెయినర్

సాక్షి ఎఫెక్ట్..

సంగెం : వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై సంగెం మండలంలోని కాపులకనిపర్తి లోలెవల్ కల్వర్టు స్థానంలో నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. డబుల్ రోడ్డు అయినా ఇరుకైన కల్వర్టు, లోలెవల్‌గా ఉండడంతో వానాకాలం వస్తే వరదలకు రాకపోకలు బంద్ అవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలుమార్లు పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. కాగా ఈ నెల 3న సాక్షిలో 'కుంగుతున్న కల్వర్టు' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో చిరకాలంగా ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు ఇక వచ్చే వానా కాలం నుంచి తొలుగుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాలు తెలిసేలా ప్రత్యేక కథనాలు ప్రచురించిన సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

దారి మళ్లింపు

సంగెం మండలంలోని కాపులకనిపర్తి వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టినందున వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారిని మళ్లించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నుంచి మహబూబాబాద్ వైపు వెళ్లే వాహనాలు కాపులకనిపర్తి గ్రామపంచాయతీ నుంచి ఆశాలపల్లి మీదుగా కూచన గార్డెన్ దగ్గర ప్రధాన రహదారిపై, తిరుగు ప్రయాణంలో అదే రహదారి గుండా ప్రయాణించాలని పేర్కొన్నారు. నూతన బ్రిడ్జి నిర్మాణం అయ్యే వరకు ప్రయాణికులు, ప్రభుత్వ, ప్రైవేట్ వాహనదారులు సహకరించాలని ఆమె కోరారు. కాగా కాట్రపల్లి మీదుగా వచ్చేవారు సైతం కూచన గార్డెన్ నుంచి ఆశాలపల్లి మీదుగా ప్రయాణించాలని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా నిల్వ చేసిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నర్సంపేట టౌన్ సీఐ పులి రమేష్ గౌడ్ కథనం ప్రకారం..లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి నూకలుగా మార్చుతున్నారనే సమాచారం మేరకు నర్సంపేట పట్టణంలోని కమలాపురం గ్రామ శివారులోని ఎశబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన భూమిలోని రేకుల షెడ్డులో మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన 51 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొంగ వినోద్, ఎశబోయిన రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బొజ్జ రవీందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళలో 8రకాల పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి స్పందన, ఏపీఎం లలితాదేవి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి



బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్ యమునారెడ్డి

నెక్కొండ : ఆర్టీసీ అందజేస్తున్న రాయితీలు, సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి అన్నారు. నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహబూబాబాద్ డిపో డీఎం విజయ్ ఆదేశాల మేరకు అధికారులు బస్‌పాస్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అనేక రాయితీలను ప్రవేశపెట్టిందని, సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీని ఆదరించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆమె బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో బస్‌పాస్ సెక్షన్ ఇన్‌చార్జ్ మహ్మద్ నబి, వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, వార్డు సభ్యుడు తోట సాంబయ్య, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

నర్సంపేట : నర్సంపేట డిపో పరిధిలోని గూడూరులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నేడు(బుధవారం) బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు బస్‌పాస్ కోఆర్డినేటర్ మాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులు తమ వెంట సదరం క్యాంపు సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో, రూ.50 తీసుకురావాలని కోరారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని చింతనెక్కొండలో ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సర్పంచ్ గటిక సుష్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్ధన్నపేట : ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలను మండల నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని కేక్ కట్ చేయించారు. కాగా నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మహనీయుల విగ్రహాలకు రంగులు వేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

నర్సంపేట : ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిరావుపూలే, 14న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మున్సిపల్ అధికారులు పట్టణంలోని పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి అంబేడ్కర్ విగ్రహానికి రంగులు వేయాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ దళిత ప్రజా సంఘాల కో కన్వీనర్లు దళిత రత్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుంటి వీరప్రకాశ్, స్వచ్ఛంద సేవా సంస్థల కో ఆర్డినేటర్ కోట డేవిడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తడుగుల విజయ్, జేఏసీ గౌరవ సలహాదారులు బోయిని నారాయణ, కొమ్ముల నవీన్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని కాంక్షించేది కాంగ్రెస్'



కాంగ్రెస్ పార్టీ పట్టణ నూతన కార్యవర్గం

నర్సంపేట : దళిత, గిరిజన, బడుగు బలహీన మైనార్టీతో పాటు అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షించే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేయాలని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి అన్నారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ సమష్టిగా ప్రజల మధ్య ఉంటూ కష్టపడాలని పిలుపునిచ్చారు. అనంతరం నర్సంపేట పట్టణ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా బత్తిని రాజేందర్, ఉపాధ్యక్షులుగా వేముల సారంగం, కొలువుల వెంకటేశ్వర్లు, పంబీ వంశీకృష్ణ, దూడల సాంబయ్య, కొంకీస మదన్‌కుమార్, జూలపల్లి రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మాదాసి రవికుమార్, కార్యదర్శులుగా మోటం రవికుమార్, గొర్రె నవీన్‌కుమార్, దారంగుల కొమురయ్య, చిప్ప నాగ, నాంపల్లి వెంకటేశ్వర్లు, మోతె నరేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి చింతల క్రాంతిరెడ్డి, కాటబోయిన స్వామి, ప్రచార కార్యదర్శులు కొల్లూరి మధుకర్, జన్ను మురళి, గట్ల రజనీకాంత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు సాంబయ్య, కిసాన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల ప్రతాప్‌రెడ్డి, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు పోతరబోయిన చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, తహసీల్దార్ కోమి

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ ఆదర్శ పాఠశాల, చెన్నారావుపేట హైస్కూల్ నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ బన్సిలాల్ పరిశీలించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట, ఖానాపురం గ్రామాల్లో పదోతరగతి పరీక్షలు కొనసాగాయి. ఇందులో భాగంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సకాలంలో హాజరై పరీక్షలు రాశారు. తహసీల్దార్ సుభాషిణి పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో జరుగుతున్న పదోతరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ కోమి, ఎస్సై దేవేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు తగు సూచనలు చేశారు.

మట్టిరోడ్డుకు మోక్షమెప్పుడో!

- గుంతలమయంగా ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట రోడ్డు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట మట్టిరోడ్డు

నర్సంపేట రూరల్ : ఇటుకాలపల్లి నుంచి దబ్బీర్‌పేటకు వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో అటుగా వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కనీసం మంజూరు చేసిన దాఖలాలు లేవు.

నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామస్తులకు సంబంధించిన 80శాతం మేర వ్యవసాయ భూములు మొత్తం ఖానాపురం మండలంలోని దబ్బీర్‌పేట శివారులోనే ఉన్నాయి. దీంతో ఈ గ్రామానికి చెందిన ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం దబ్బీర్‌పేట వైపు వెళ్తుంటారు. ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట రోడ్డు వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు ఉంటుంది. మట్టిరోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని, దీంతో రోడ్డుపై వెళ్లాలంటే వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గుంతల మయం రోడ్డుపై వెళ్లలేని వాహదారులను ఆకులతండా క్రాస్ రోడ్డు, ఇప్పల్ తండా, ఏనుగల్ తండా మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో అదనంగా మరో పది కిలోమీటర్ల దూరం వస్తోంది. రోడ్డును మంజూరు చేయించి నూతన రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టినప్పటికి పట్టింపులేక పోయిందన్నారు. దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టిన ఉన్నతాధికారులకు సైతం నివేదించారు. ఏదిఏమైనప్పటికి ప్రజల అవసరాల కోసం ఉపయోగపడే రోడ్డును తక్షణమే నిర్మించాలని పలువురు రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే హామీ ఇచ్చారు



మండలంలోని ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఈరోడ్డు గుండా నిత్యం ప్రజలు, రైతులు ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఈరోడ్డును ఐటీడీఏ నిధులతో మంజూరు చేయిస్తానని అన్నారు. త్వరలోనే పనులను ప్రారంభమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈరోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయి.

– మండల రవీందర్, సర్పంచ్, ఇటుకాలపల్లి

విద్యుత్ మీటర్లు అమర్చుకోవాలి

దామెర : ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు అమర్చుకోవాలని విద్యుత్ ఏఈ గుర్రం రమేష్ సూచించారు. మండలంలోని ఊరుగొండ, దుర్గంపేట్, ఒగ్లాపూర్ గ్రామాల్లో మంగళవారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ ఎస్సీ కాలనీల్లో పర్యటించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్ వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించిందని అన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగించినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, ఒక ఫొటోతో మీ సేవాకేంద్రంలో రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకొని మీటర్ పొందాలని వివరించారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట సబ్ ఇంజనీర్ చందన, ఎం.రవీందర్, వేణుగోపాల్. పి.సురేష్, రవీందర్, మనోహర్, కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.